# దొంగతనం

"ఆ దొంగ కర్రోడెక్కడ్రా?" అని అడిగాడు వెంకట్రాయులు ముఖం చిట్లించుకుని చూస్తూ.

హాల్లో గోడనానుకుని కూచున్న కుర్రాళ్లయిదుగురూ మాసిన దుస్తులతో, చెదిరిన జుట్లతో, వదులొదులుగా కట్టిన పాత మూటల్లాగున్నారు.

తన సెల్‌ఫోను చార్జింగ్ వైరును ప్లగ్‌లోకి దోపుతూ "అవున్రా... ఆ చోటా చోర్రా యెక్కడరా?" అని ప్రశ్నించాడు ప్రజాపతి. తరువాత చిడుముడి పాట్లతో అలవాటు పడిపోయిన తన నల్లటి ముఖాన్ని వెంకటరాయలకేసి తిప్పి "యెక్కడికి పోతాడ్ సార్! యిక్కడ్నే యెక్కడ్నో వుంటాడు" అన్నాడు. ఆ తరువాత చిన్న స్టూలుపైన సన్నటి బొగ్గుల బస్తాలాంటి తన శరీరాన్ని సర్దుకోలేక అవస్థపడుతూ కూర్చుని, హాల్లోవున్న షోకేసులకేసి చేయి చాపి "దానికింకో పాలిష్ పడాల సార్... అప్పుడుగానీ చమక్ రాదు" అన్నాడు.

ముడిబడిన చెక్కలా చారలు తేరిన తన ముఖానికి మరికొన్ని కోపం ముడతల్నిచేరుస్తూ "రెండు నెలలుగా మీ గుంపంతా మా యింట్లోనే తిష్టేసేసినారు. రుద్దిన తావులోనే రుద్దతా దినాలు తోసేసినారు. యిప్పటికి యాభైవేలదాకా వదిలించేసినారు. కరిగిపోతావుండేది మా దుడ్డు. నీదేం పొయ్యింది? సంవత్సరాల తరబడీ చేసిన పనే మళ్లా చేస్తా వుండిపోతానంటావు" అని అరిచాడు వెంకట్రాయులు.

సాయంత్రపు యెండ కిటికీల్లోంచి యేటవాలుగా యింటిలోపలికి పడుతోంది. కిటికీలోంచి చూస్తే యిప్పుడిప్పుడే యిండ్లు కడుతున్న కాలనీ ముసలివాడి బోసినవ్వులా వికారంగా కనబడుతోంది.

ప్రజాపతి వుత్సాహమూ, నిరుత్సాహమూ రెండూ పలకని గొంతుతో "మీ అల్లుడు బ్యాంకు మేనేజర్ సార్. ఆయన యిల్లు జమ్మని దర్జాగా వుండాల... చూసినోళ్లు మమ్మల్ని పిలిచి కామ్ యియ్యాల...." అన్నాడు.

"మా అల్లుడిది వొకే వూర్లో గూటం గొట్టుకోనుండే ఉద్యోగం కాదు. రెండేండ్లకొకతూరి ట్రాన్స్ఫరు. యిది బాడిగ కొదిలే యిల్లు. కిటికీలకూ తలుపులకూ రంగులుంటే రెంటు జాస్తీగా వస్తిందని యీ పనిలోకి దిగినాడు" అని వాపోతూ మళ్లీ కుర్రాళ్లకేసి తిరిగి "ఆ కర్రోడేమైనాడో చూడండ్రా! మా యింట్లోంచి యేమెత్తుకోని పోయినాడో చెప్పండ్రా" అని ఆక్రోశించాడు వెంకట్రాయులు.

వంటింట్లోంచీ గరిటె చేతబట్టుకోని వచ్చిన ముసలావిడ "అడగతావుండేది మిమ్మల్నేరా.... ఆ కర్రోడు మూసి పెట్టిన కోళ్ల నెత్తుకోని పొయ్యేరకం. వాడేం చేతబట్టుకుని పోయినాడో అని అంగలారస్తా వుండాము" అని గొంతు చించుకుంది. తరువాత నీళ్ల

నిండిన కళ్లతో భర్తకేసి తిరిగి "దాని సొత్తేదో దొంగతనంగా దెచ్చి నా కూతురికి పెట్టేసినామని నా కోడలొక పక్క సాపిస్తా వుండాది. వాళ్ల ఆస్తేదో దోచుకోనొచ్చి యిల్లు గట్టుకున్నాడని మా అల్లుణ్ణి వాళ్ల అన్నదమ్ములు పొడుచుకోని తింటా వుండారు. యిది పైసా పైసా చేర్చి పెట్టి కట్టిన యిల్లు. దీని కోసరం నా బిడ్డెంత కష్టం పడిందో నాకు తెలుసు, ఆ వెంగటేస్పరుడికి తెలుసు" అంటూ ముక్కు చీదుకుంది.

"అదంతా యిప్పుడవసరమా? గొమ్మునుండు" అంటూ వెంకట్రాయలు భార్యను మందలించాడు. ఆ తరువాత "ఆ కర్రోడు నిన్న సాయంత్రం గూడా అగుపడలేదు. యీ సరికివాడు మీ కాశికే చేరిపొయ్యుంటాడు" అని వాపోయాడు.

"రేయ్ స్వరణ్, తుమ్ అవుర్ ముఖుల్ జాకే వుస్ చోక్రాకో డూండ్‌కర్ లావ్ రే" అని ప్రజాపతి గుంపులోని కుర్రాళ్లిద్దరికి పురమాయించాడు. సన్నగా పొడుగ్గా మెట్లూడిపోయిన నిచ్చెన లాగున్న కుర్రాడొకడు పైకి లేచాడు. చెదిరిన పొడవాటి జుట్టుతో పాతచీపురులాగున్న కుర్రాడింకొకడు వాడి దుస్తుల్ని అరిచేతుల్తో చరిచాడు. పొగలా దుమ్ము కుర్రాళ్లందరినీ కమ్మేసింది. కీచుకీచుమంటున్న నవ్వులతో బాటూ యిద్దరు కుర్రాళ్లూ బయటి కెళ్లిపోయారు.

"మీ యింట్లోనించీ యే సామన్ పోయినా జవాబుదారీ నాదేసార్. మా చోక్రాలు అట్లాంటోళ్లు కాదు" అంటూ మొదలుపెట్టాడు ప్రజాపతి. "ఆ కాలాచోక్రాగాని పేరు బద్రీనాథ్... వానిది వారణాసి నుంచి మూడుగంటల జర్నీ చేస్తే వచ్చే గోరఖ్‌పూర్. మేమంతా యిత్‌నా దూరం వచ్చింది పని చేసేదానికి సార్. మాకు నమక్ హరామ్ పనులు రావు. యింటి వోనర్లూ, షేట్లూ యిండ్లు మాకు అప్పగించేసి వేరే వూర్లుకుపోతావుంటారు. చాంద్‌సోనా ముందరే వున్నా మా చోక్రాలు తాకరు. యిత్‌నా బడా గర్ మీది.... కమ్‌సేకమ్ దో మైనా కా పని. యిప్పుడు ఫార్టీ దినం అయ్యింది. యింకా పది దినాల పని మిగిలింది..."

"యిప్పుటికే ఆరు నెలల బాడిగ నష్టమయ్యింది. కాంపౌండువాల్ గట్టినోళ్లు మూడు నెల్లులాగినారు. యిప్పుడు మీరు తగుతుకున్నారు. నెలకు మూడువేల బాడిగ నష్టం..." అంటూ వెంకట్రాయులు పళ్లు కొరికాడు.

కిటికీలోంచీ పడుతున్న యెండ మరికాస్త వాలి కుర్రాళ్లపైకి సూటిగా పడుతోంది. అయినా యెండను పట్టించుకోకుండా కుర్రాళ్లు ముగ్గురూ గుసగుసలాడుకుంటున్నారు.

వాళ్లనందరినీ మింగేసేలా చూస్తూ "యిప్పటికే ఆ పాలిష్ వాసనతో మా యిద్దరికీ వుబ్బసమొచ్చేసింది. మెటీరియల్‌తో గలిసి పనంతా ముప్పయి వేలవతాదని ముందుగా చెప్పినావు. యిప్పుడు యాభై దాటేసినావు. వేరే వూర్లల్లో పననే సాకుతో నువ్వు వారానికోసారి మాత్రమే దిగబడతావు. మస్తరని జెప్పి కూలీదుడ్లు వసూలు జేసుకోని మాయమైపోతావు. యీ పిల్లోళ్లు అది చాల్లేదనీ, యిది మిగల్లేదనీ నూర్లు నూర్లుగా పిండుకుంటారు. యిదే మాదిరిగా యింకో నెల జరిగిందంటే మా కొంప గుండమే" వెంకట్రాయలు ఘోషించాడు.

అతడికేసి కళ్లార్పకుండా చూస్తూ "నేను వొకే వూర్లో ఉంటే మిగిలిన పని జరిగేది యెట్లాసార్?" అన్నాడు ప్రజాపతి. "యిప్పుడు అయిదు వూర్లల్లో పాలిష్ పని జరగతావుంది

సార్. అనంతపూర్‌లో కాంట్రాక్టరు యిల్లు, కర్నూల్లో ప్రొఫెసర్ గర్, కడపలో ఆఫీసర్ బంగళా, నంద్యాలలో కరస్పాండెంట్ గర్, గుంటూర్లో లాయర్ యిల్లు... మా పనులు యీ యేరియవాళ్ల మాదిరిగాదు సార్... రిమార్క్ వుండదు. పనిచూసి పనులు యిస్తారు మాకు...."

"మేము వాళ్ల మాదిరిగా లక్షాధికారులుగాదు సామీ. దీంతో యిడిసిపెట్టు మమ్మల్ని" వెంకట్రాయలు గొంతు వుప్పు కాగితంలా మూల్గింది.

ప్రజాపతి పెదవి విరుస్తూ తన చొక్కా జేబులోంచీ నలిగిపోయిన డైరీని చేతిలోకి తీసుకున్నాడు. అనవసరంగా వేలికి యెంగిలి తడుపుతూ పెన్నుతో లెక్కలు గట్టసాగాడు.

కిటికీలోంచి దూరంగా కనబడుతున్న శేషాద్రి కొండలు యెండల ధాటికి మూర్ఛపడిన కూలీల గుంపుల్లా వున్నాయి. అయిసుబండివాడి గంట వినబడగానే కుర్రాళ్లు ముగ్గురూ అటువైపుకు మెడలు రిక్కించారు.

వెంకట్రాయులు మరచిపోయిన విషయం జ్ఞాపకం వచ్చినట్టుగా వులిక్కిపడి "ఆ కర్రోడ్ని యెతకండిరా" అని గావుకేక పెట్టాడు.

కుర్రాడొకడు వికవికా నవ్వి "హమారె భయ్యా వుస్‌కో కీంచకర్ లాతే" అన్నాడు.

"వాళ్లేం మాట్లాడతారో మాకు అర్థం గాదు. మా మాటలు వాళ్ల నెత్తికెక్కవు. యీ రెండు నెల్లుగా యీ మాదిరే తనకలాడతా వుండాము" అని వాపోయాడు వెంకట్రాయులు.

ప్రజాపతి డైరీని మూసి పెట్టుకుంటూ "వాళ్లకు తెల్గురాదు సార్. మేం మాట్లాడేది హిందీ" అన్నాడు. "యీ మాదిరి తెల్గురాని చోక్రాలయితే పని జల్దీగా అవుతాది సార్. వీళ్లు మీ యింట్లోనే వుంటారు. లేటుగా కామ్ కొచ్చేదీ, జల్దీగా పని వదిలేదీ వుండదు. సుభాసే షామ్ తక్‌పనే పని..."

వంటగదిలోంచి విసవిసా వచ్చిన ముసలావిడ "వీళ్లు పనిచేసేది తక్కువ, మాట్లాడేది జాస్తీ..... యెప్పుడూ యికయికలూ పకపకలూ...రేత్రుల్లో గూడా నోటిమింద కాయెయ్యరు...." అంది.

ప్రజాపతి నొసలు చిట్లించుకుంటూ పక్కకు తిరిగి "వాళ్లకు బాత్‌చీత్ వుంటేనే పని జల్దీగా అవతాది మాజీ. అది లేకపోతే వాళ్లకు వాళ్ల వూరు యాదికొస్తింది. బార్‌బార్ వూరికి పోలేరు మాజీ. కితనాదూర్? రైలులో దో దిన్‌కా సఫర్...కితనా ఛార్జీ....వీళ్ల నెలదినాల జీతం కంటే జ్యాదా..." అన్నాడు.

"నా కూతురు యేడ సామాన్లాడ పారేసి పొయ్యింది. ఆ కర్రోడేమెత్తుకోని పోయినాడో?" ముసలావిడ మళ్లీ రుసరుసలాడింది.

"వాని దెగ్గిర పైసాలేదు మాజీ" ప్రజాపతి వెంటనే అడ్డు తగులుతూ అన్నాడు. "జీతంపైసా యీ చోక్రాల చేతికియ్యను. వాళ్ల మా బాప్‌కు సీదాగా బ్యాంక్‌లో అంపిస్తాను. యీ చోక్రాలకు యింకా మూంచ్ దాడీ రాలేదు. కానీ నన్ను బోల్తా గొట్టించి దస్ పంద్రా తీసుకొని పాన్ పరాగ్‌లు నమిలేస్తారు. బీడీలు వూదేస్తారు. యెవ్వరైనా వాళ్ల మా బాప్ మాట ఖాతరు చేస్తారు గానీ నా మాట ఖాతరు చేస్తారు మాజీ?"

"యింటి చుట్టూ నేలంతా వీళ్ల పాన్‌పరాగ్‌లతో యెర్రంగా అయిపొయ్యింది." వెంకట్రాయలు కళ్లురిమి చూస్తూ అన్నాడు. "వొకతూరి కోపమొచ్చి ఆ పొడుగుటోడ్ని

చెక్కతో రెండు జాడించినాను. వాడా పొద్దు సాయంత్రం దాకా కనబడలేదు. అయినా అంత బిన్నాగా యిడిసిపెట్టేదెయ్యమా వాడు? రాత్రికంతా పెండ్లి కొడుకు మాదిరిగా యింటికి తిరుక్కోనొచ్చినాడు."

"జవాబుదారీ లేకుండా పని యిడిసిపెట్టిపోతే నేను వొప్పుకోను సార్" ప్రజాపతి కుర్రాళ్లకేసి కోపంగా చూస్తూ చెప్పుకుపోయాడు. "వీళ్ల మా బాప్ వీళ్లను కామ్‌కు తీసుకోని పొమ్మని నా కాళ్ల పైన పడినారు. బీదోళ్లు...వీళ్లు అంతా మేజర్లని కాగజ్‌లో దస్తత్ చేసినారు. నాకు చెప్పకుండా వాపస్ పోతే పూరా పైసా నాకు వాపస్ చేస్తామని రాసిచ్చినారు. అందుకే మా బాప్ వీళ్లను వాళ్ల వూరికి రానీరు. నా దగ్గర పని అంటే అంత కరెక్టుగా వుండాల.... నా మాటలేకుండా పానీ గూడా తాగకూడదు.." మాట్లాడుతూనే షోకేసు దగ్గరికి నడిచి "యే అవుర్ తోడా నైస్ హోనా సార్. యింక వొక కోట్ అయినా పడాల... యీ రంగు తోడా డార్క్ రావాల.. గోడలకు సున్నమూ, డిస్టెంపరూ యెప్పుడేస్తారు సార్? ఆ పనిలో మా చోక్రాలు రాకెట్లు...." అన్నాడు.

"సున్నమూ, డిస్టెంపరా? మీరా! వొద్దొద్దు..." వెంకట్రాయలు గొల్లుమన్నాడు. "అంత దుడ్డుయిప్పుడు లేదు. యిప్పుడీ పాలిష్ పనిలోకే కష్టం పైన దిగినాము."

యెదుట కూచున్న వాళ్లకూ తమకూ సంబంధం లేదన్నట్లుగా కుర్రాళ్లు ముగ్గురూ గుసగుసలతో తమ ప్రపంచాన్ని తాము సృష్టించుకునేశారు. వంటగదిలోంచీ ముసలావిడ అప్పుడప్పుడూ తొంగి చూస్తోంది.

"యే వాల్‌కో దేఖో సార్" గోడను పట్టిచూపుతూ ప్రజాపతి చెప్పసాగాడు. "పూర్ వాల్ కో క్రాక్స్ వచ్చినాయి. వీటికంతా పట్టీ పట్టి రంగులు కొట్టాల. లేకపోతే డామేజ్ అవుతాయి. మేము మళ్లా రావాలంటే మీరు మళ్లా చార్జీల పైసలు భరాయించాల. మీకు పైసా నష్టం. మాకు టయిం వేస్టు.... వొకసారి వచ్చినప్పుడు కామ్ పూరాగా ముగించేసి పోవాల..."

ముసలావిడ టీ గ్లాసునందిస్తూ భర్త చెవిలో యేదో గొణిగింది. "ఆ కర్రోడే మెత్తుకోని పోయనాడో చెప్పండిరా" అంటూ వెంకట్రాయలు బుసలు కొట్టాడు.

"వానికెప్పుడూ పేట్‌బార్ సార్...దవాకోసరం మెడికల్ షాపుకు పొయ్యంటాడు. మాదంతా బరోసాపైన జరిగేపని...నమక్ హరామ్ పనులు చేసి బురానామ్ తెచ్చుకోము సార్.... నా కొడుక్కు హైద్రాబాదులో ఫర్నీచర్ షాపుండాది. వొకసారి మాల్ ఖరీద్ చేసినోళ్లు యింకో షాపుకుపోరు" వెంకట్రాయలు ముఖంలో విసుగు తగ్గినట్టుగా అనిపించగానే, గొంతు తగ్గించి "యింత పెద్ద యిల్లుకు ఫర్నీచర్ వుండాలసార్ ... నా కొడుకు షాపులో అంతా మాడర్న్ ఫర్నిచర్. ఫ్రెంచిటైపు. నంద్యాలలోవుండే మా అల్లుడి డిపోనించీ వుడ్ తెప్పించి, మా యేరియా నించి వచ్చిన కార్పెంటర్లతో స్పెషల్‌గా తయారు చెయ్యిస్తాడు. అంతా ఫస్టుక్లాసు పని" అన్నాడు.

"మొత్తం మీ కుటుంబాన్నంతా యీ యాపారంలో దించేసినావు. యిన్ని యాపారాలు పెట్టుకోని బీదోని మాదిరిగా వేషాలేస్తావుండావు. మేమేమో వొక యిల్లు గట్టుకోని బుక్కా పకీర్లయిపోయినాము" అన్నాడు వెంకట్రాయలు జీరబోతున్న గొంతుకతో.

స్టూలుపైన సర్కస్ యెలుగు బంటిలా మళ్లీ సర్దుకుని కూర్చుంటూ "యిత్‌నా దూరం వచ్చిందెందుకు సార్." అని ప్రశ్నించాడు ప్రజాపతి. "యిస్‌పేట్‌కో బరానేకేలియే. కదువుసార్... దీన్ని భర్తీ చేసేదానికనే వచ్చినాము. యీ పని కష్టం. అందుకే నా కొడుక్కు ఫర్నీచర్ షాపు పెట్టించినాను. యిదే మాదిరిగా మొత్తం తీస్ - ముప్పయిమంది - చోక్రాలు పనులు చేస్తా వుందారుసార్... నేను అకేలా ఆద్మీ... అన్ని వూర్లూ తిరిగి ముప్పయి మందికీ అన్నీ సప్లయ్ చేయాల...సామాను అందించాల. దాణా రెడీ జెయ్యాల...స్టవ్వుపైన ఖానా చేసేదెంతపని? దానికి పోటీపడి యీ చోక్రాలు ఫైటింగు జేసుకుంటారు. ప్రతినెలా దస్ తారీఖ్ కంతా వీళ్ల మా బాప్‌లకు పైసా చేర్చాల...నాకు యే వూర్లో ఖానానో, యే వూర్లో సోనానో నాకే తెలియదు. యీ బేవ్‌కూఫ్‌లలో యెవడు యెప్పుడు రైలెక్కేస్తాడో తెల్వదు.." నోరు జారిన సంగతి స్ఫురించినట్టుగా ప్రజాపతి నాలుక కరచుకున్నాడు. తరువాత "వుస్‌కా కపడా, సామాన్ హై యా నహీ దేఖోరే..." అన్నాడు.

తమ కబుర్లకు అడ్డొచ్చినందుకు విసుగ్గా "వుస్‌కా తైలీ నహీ చాచా. వుస్‌కా సిమెంట్ కా తైలీబీ నహీ" అన్నాడో కుర్రాడు.

"సిమెంట్ గోతమా? అన్ని గుడ్డలు వానికే దుండాయి? అవన్నీ మా యింట్లోనించీ కొట్టేసిన సామాన్లే అయ్యుంటాయి...." వెంకట్రాయలు గుండెలు బాదుకోసాగాడు.

ప్రజాపతి కుర్రాళ్లకేసి వురిమి చూసి... "అవి అంతా మా పాలిష్ సామాన్ అయివుంటాయి సార్. మీరు యిల్లు అంతా వెతుక్కోండి. యేమైనా మిస్ అయ్యుంటే అడగండి" అన్నాడు.

ముసలావిడ నిప్పులు తొక్కిన కోతిలా వంటగదిలోంచి హాల్లోకి, హాల్లోంచీ వరండాలోకి గిరికీలు తిరుగుతూ "కుక్కరూ...మిక్సీ..టేపురికార్డరూ...వాచీ..." అంటూ కనబడుతున్న సామాన్ల పేర్లనంతా యేకరవు పెట్టసాగింది. ఆవిడ వెంటే పరిగెడుతూ సామాన్లన్నీ వెతికి చూసుకున్నాక "వాడు కండ్లు చూస్తావుండ గానే కంటిపాపను కోసుకోని పొయ్యేరకం. యేందో పెద్ద సామానే గోతంలో జుట్టుకోని పొయ్యుంటాడు" అంటూ వగర్చాడు వెంకట్రాయలు.

ప్రజాపతి నలుగుతున్న ప్లాస్టిక్ సంచిలా మూలిగాడు. కుర్రాళ్లకు సైగలతోనే యేదో పురమాయించాడు. వాళ్లు ముగ్గురూ రైలు యింజన్లలా కూత కూస్తూ పెరట్లోకెళ్లారు.

"యిది యిప్పుడిప్పుడే పై కెత్తి వస్తావుండే సంసారం. నా కూతురూ అల్లుడూ యెంత కష్టం పడి యీ యిల్లు గట్టుకున్నారో యెవురికి తెలిస్తింది? వాళ్ల సొత్తు కాపాడేదానికనే మేము ముసిలోళ్లిద్దరం వూరుగాని వూరు కొచ్చుండాము. మేము బతికుండంగా వాళ్ల సొత్తుపైన చెయ్యేవరైనా యేస్తే గొమ్మునుండము.." ముసలావిడ యిల్లంతా తిరుగుతూనే అంగలార్చింది.

కుర్రాళ్లు పెరట్లోంచీ తమ సామానంతా తీసుకొచ్చి హాల్లో పోగేశారు.

"అంతా వొకతూరి చెక్ చేసుకోండి సార్. మా చోక్రాలు దొంగతనం చేస్తే నేను గొమ్మునుండను. వాళ్ల చమ్డాతోలు వొలిచేస్తాను...." అన్నాడు ప్రజాపతి.

కుర్రాళ్ల సామాన్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ "ఆ కర్రోడెత్తుకోని పోయిన సామాన్ల సంగతేమంటావు? నేను వొదిలి పెట్టను. పోలీసు రిపోర్టిస్తాను" అని మొరిసాడు వెంకట్రాయలు.

"మీ యింట్లో నించీ వొకసామానూ మిస్ కాలేదు. మా చోక్రాగాడెత్తుకొని పొయ్యిండేది మా పాలిష్ సామాన్...యే సామాన్ మిస్సయిందని రిపోర్టిస్తారు సార్?" ప్రజాపతి నిబ్బరంగా అడిగాడు.

"అదంతా నాకు తెలియదు. మా వూర్లో వుండే పోలీసులు నా మాట యింటారా? నీ మాట యింటారా? ఆ సిమెంటు గోతం మా యింటికి తిరుక్కొనొచ్చేదాకా నువ్వు కట్టు కదలద్దు..." వెంకట్రాయలు సవకం తీసి నడుముకు గట్టుకుంటూ వాదించాడు.

"మీ యిల్లులో వుండి పని చెయ్యొద్దు అంటారు. వేరే వూరు పోతామంటే వొప్పుకోరు. సాక్ష్యం లేకుండానే దొంగ అంటారు. పోలీస్ రిపోర్టని బెదిరిస్తారు. యిదేం న్యాయం సార్?" ప్రజాపతి గొంతులో కోపం ధ్వనించింది.

పొడవాటి కుర్రాడు వీధిలోంచి పరిగెత్తుకుంటూ వచ్చి "వో మిల్‌గయా చాచా. వుస్‌కో భరద్వాజ్ కీంచ్‌కర్ లాతాహై" అని ప్రకటించాడు.

నల్లటి ముఖాన్ని కోపంతో చిత్రంగా జేపురింప చేసుకుంటూ "జల్దీసే లావ్‌రే వునే...వుస్‌కీ మాకీ..." అంటూ ప్రజాపతి పెద్దగా తిట్లు మొదలుపెట్టాడు.

ముందుగా గోతం మూటను నెత్తిన పెట్టుకుని వస్తున్న కుర్రాడు "టేషన్‌మే మిలా మేరా దోస్త్....దోస్త్ కో సాలామ్‌కర్..." అని వుత్సాహంగా నాట్యం చేస్తున్నాడు.

నల్లటి కుర్రాడి చేయి పట్టుకుని లాక్కొస్తున్న మరో కుర్రాడు "యే నంద్యాల బస్టాప్ మే మిలా చాచా" అన్నాడు.

"దేఖోసార్. వీడు వారణాసి రైలు యెక్కలేదు. యీ పొద్దు మేము అంతా నంద్యాలకు పోతామని బస్టాండులో వున్నాడు" ప్రజాపతి నల్లటి కుర్రాడ్ని మింగేసేలా కోపంగా చూస్తూ అన్నాడు.

"ముందుగా ఆ మూటలోయేముండాదో చూడండిరా" అంటూ ముందుకు దూకిన వెంకట్రాయలు, గోతాన్ని కిందకి లాగి, దానికి కట్టిన దారాన్ని వూడలాగాడు. తరువాత మూటను పైకెత్తి కిందికి బోర్లించాడు. రెండు వెలిసిన చొక్కాలూ, రెండు మసిబారిన నిక్కర్లూ, వొక పాతలుంగీ, వాటిని కిందకి తోస్తూ వొక ఖాళీ పెయింట్ బక్కెట్ నేలపైన పడింది.

"చూస్కోండి సార్. వాడేమీ యెత్తుకోని పోలేదు. అది ఖాళీ కలర్ బక్కెట్..." అన్నాడు ప్రజాపతి.

"నాకు ముందునుంచీ అనుమానమే. యీ వుపద్రం బట్టినోడు రంగు ఖాళీ అయినప్పుటి నించీ యీ బకెట్టుపైన కన్నేసుండాడు. రెండు మూడు తూర్లు లాక్కున్నాను. కానీ వీడు దీన్ని కొట్టుకోనే పోయినాడు" ముసలావిడ కారుబారు చేస్తూ వచ్చి ఖాళీ బకెట్టును చేతికెత్తుకుంది.

"యే చోక్రాకో యిస్ బక్కెట్ అచ్చా హోతా చాచా. వో జ్యాదా వెయిట్ నై ... రంగ్ లేనేకో అచ్చాహోతా" నిచ్చెన కుర్రాడు వివరించాడు.

"వీడు చిన్నోడు సార్. రంగులు మోసేదానికి యీ మాదిరి చోటా బకెట్లు అన్ని చోట్లా దొరకవు. బడా బకెట్ మోసేదానికి వీనికి హైరానా అయితాది. యిది యీజీగా వుంటాదని యెత్తుకున్నాడు. అంతే. యీ మాదిరి బక్కెట్లు నేనుయెన్నో సెంకడ్‌హాండ్ మార్కెట్లో అమ్మేసినాను. దీనికి యిరవై రూపాయలు కూడా రావు. పిల్లోడు సార్. వాని చాహత్ అది. యిచ్చెయ్యండి" అన్నాడు ప్రజాపతి నిర్లిప్తంగా.

"వీడెత్తుకోని పొయ్యింది దీన్నొక్కదాన్నే అంటే నేను నమ్మను. యింకా యేందో వుంటింది. మీరంతా కలిసి నన్ను మోసం చేస్తావుండారు" వెంకట్రాయలు అనుమానంగా గీ పెట్టాడు.

"వో సబీ సామాన్ నికాల్రే" అంటూ ప్రజాపతి కుర్రాళ్లనందరినీ చంపేసేలా వురిమిచూశాడు. తరువాత "మా సామాన్ పూరా యిక్కడ్నే వుంది సార్. అంతా చెక్ చేసుకోండి. ఆ మాదర్చేద్ గాడికి ఆ ఖాళీ బక్కెట్ పైన ఆశ పడింది. దాంట్లో వుండే రంగును వాడే మీ కిటికీలకూ, తలుపులకూ పెయింట్ చేసినాడు. ఖాళీ అయినాకయినా దాన్ని వానికియ్యలేరా సార్? నా పేమెంట్ ఆరువేలా మూడునూర్లు యియ్యాల. అదిస్తే మేమిప్పుడే నంద్యాల పోతాం."

సెల్‌ఫోను లోంచీ వెలుగు రావడం కనబడగానే ప్రజాపతి దాని చార్జింగ్‌ను ప్లగ్‌లోంచీ తీసేశాడు. చార్జర్ వైరుని చుట్ట జుట్టుకున్నాక జేబులోంచీ డైరీ చేతికి తీసుకున్నాడు.

ముసలావిడ ఖాళీ ప్లాస్టిక్ బక్కెట్‌ను వంటగదిలోకి తీసుకెళ్తూ "కందిపప్పు పోసుకునేదానికి సరిపోతింది" అని గొణిగింది.

"ఆరువేలా మూడు నూర్లా? అదేం లెక్క? వివరంగా చెప్పు?" అంటూ వెంకట్రాయలు తాపీగా కుర్చీలో కూర్చున్నాడు.

వరండా మెట్లమీద గొంతుక్కూచున్న నల్లటి కుర్రాడు దిబ్బలోకి విసిరేసిన డొక్కు బక్కెట్‌లా కనబడుతున్నాడు. కనురెప్పలు ఆర్పకుండా వాడు గాలిలోకి ఖాళీ చూపులు విసురుతున్నాడు. వాడి చేతులపైన యింకా రంగుల డాగులు అతుక్కునే ఉన్నాయి.

**(ఆదివారం ఆంధ్రజ్యోతి, 5 జూలై 2009)**